ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

జనగామ

గురువారం 11 జనవరి 2024



పైసలేంచేశారు?

'బీసీ బంధు' లబ్ధిదారులకు సర్కారు ఫోన్

- పరికరాలు చూపించాలంటూ ఆదేశాలు
- పది రోజుల గడువు విధించిన అధికారులు
- లేదంటే డబ్బుల రికవరీకి సన్నాహాలు
- జిల్లాలో 560 మందికి అందిన సాయం

జనగామ టౌన్, జనవరి 10: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కొన్ని పథకాలను ప్రక్షాళన చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు గత ప్రభుత్వం అమలుచేసి విమర్శలు ఎదుర్కొన్న పథకాలను రద్దు చేస్తున్నారు. ఇప్పటికే ఆరు నెలల క్రితం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురాగా.. సీఎం రేవంత్‌రెడ్డి దానిని రద్దు చేసి ఆరు గ్యారెంటీల్లో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం రూ.5 లక్షల సాయాన్ని చేర్చారు. తాజాగా బీసీ కులవృత్తిదారులకు అందించిన నిధులపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఆరు నెలల క్రితం కేసీఆర్ హయాంలో బీసీ కులవృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'బీసీబంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన బీసీ కులవృత్తిదారులకు పరికరాలు కొనుక్కునేందుకు తలా రూ.లక్ష సాయం చేశారు. ఈ పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను అప్పట్లో ఎమ్మెల్యేలకు అప్పగించారు. దీంతో కేవలం ఎమ్మెల్యే అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలకే లబ్ధి చేకూరిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో బీసీలకు లక్ష సాయంపై అధికారులు ప్రక్షాళన చర్యలకు దిగడం చర్చనీయాశంగా మారుతోంది.

పది రోజుల్లో పరికరాలు చూపించాల్సిందే..

బీసీబంధు కింద రూ.లక్ష సాయం పొందిన వారు పది రోజుల్లో తాము కొనుగోలు చేసిన పరికరాలు చూపించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రకటన జారీ చేశారు. లబ్ధిదారులకు ఇప్పటికే ఫోన్ ద్వారా కూడా సమాచారం ఇచ్చారు. జిల్లాలో ఈ పథకం కింద 560 మందికి రూ.లక్ష చొప్పున మంజూరు చేశారు. నియోజకవర్గాల వారీగా చూస్తే అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో 218 మందికి, పాలకుర్తిలో 188 మందికి, జనగామలో 154 మందికి రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. అత్యధికంగా దేవరుప్పుల మండలంలో 78 మందికి ఈ పథకం మంజూరైంది. సాయం పొందిన వారిలో చాకలి, మంగలి, కమ్మరి, కంసాలి, కుమ్మరి, పూసల, వడ్డెర, వడ్రంగి తదితర కులాల వారు ఉన్నారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం లబ్ధిదారులు కులవృత్తికి సంబంధించిన పరికరాలు తప్పకుండా కొనాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల్లో చాలా వరకు కులవృత్తులు చేయని వారే ఉన్నారని గతంలో ఆరోపణలు వచ్చాయి. అంతేగాకుండా అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, ఇచ్చిన సాయాన్ని దుర్వినియోగం చేశారని గ్రామాల్లో ప్రచారం జరిగింది. గత ప్రభుత్వం చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకుందే తప్ప లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారా.. లేదా అనే విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ తరుణంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం వృథా కాకుండా చర్యలకు సిద్ధమైంది. లబ్ధిపొందిన వారు తప్పకుండా తాము కొనుగోలు చేసిన పరికరాలు చూపించడంతో పాటు వాటి బిల్లులను సమర్పించాలని కోరుతూ ఈ నెల 10న జిల్లా బీసీ సంక్షేమ శాఖ ప్రకటన జారీ చేసింది. పది రోజుల్లో వివరాలు సమర్పించకుంటే రికవరీకి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.


అనర్హులకు నోటీసులు..

ఇచ్చిన గడువు ముగిసిన అనంతరం క్షేత్ర స్థాయిలో వాటిని పరిశీలించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ తర్వాత అనర్హులను గుర్తించి నిధుల రికవరీకి నోటీసులు పంపేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం మండలాలవారీగా ప్రత్యేక అధికారితో పాటు ఎంపీడీవో ఆధ్వర్యంలో సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే ద్వారా రూ.లక్ష సాయం పొందిన వారు నిజంగానే కులవృత్తులకు వినియోగించారా లేదా..? అనే అంశాలపై వివరాలు సేకరిస్తారు. కొనుగోలు చేసిన పరికరాలను స్వయంగా వినియోగిస్తున్నారా? లేక మరొకరికి ఇచ్చారా? అనే విషయాలను తెలుసుకుని చర్యలు తీసుకోనున్నారు. అనర్హులుగా గుర్తించిన వారికి నోటీసులు పంపించి రూ.లక్ష రికవరీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పథకం దుర్వినియోగం కావొద్దనే చర్యలు..

- రవీందర్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి, జనగామ

కులవృత్తులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో గతంలో బీసీ కులాల వారికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. ఈ పథకం దుర్వినియోగం కావద్దనే ఉద్దేశంతో పరికరాలు చూపించాలని అడుగుతున్నాం. అసలైన అర్హులకు న్యాయం జరగాలన్నదే మా లక్ష్యం. అనర్హులను గుర్తించాక రికవరీ చర్యలుంటాయి.



19లోపు సీఎంఆర్ పూర్తి చేయాలి

రైస్ మిల్లర్లకు కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య ఆదేశాలు



రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ పిఎంఆర్ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య

రఘునాథపల్లి, జనవరి 10: ఈ నెల 19లోపు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) టార్గెట్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య రైస్ మిల్లర్లను ఆదేశించారు. మండలంలోని ఖిలాషాపూర్ గ్రామ శివారులో ఉన్న పిఎంఆర్ రైస్ మిల్లును కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం టార్గెట్లను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులు, ఆపరేటర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌వో రోజారాణి, విజయ డైరీ అధికారి, స్పెషల్ ఆఫీసర్ ధనరాజ్, డిటీ శ్రీనివాస్, ఎంపిడివో ఎండి.హషీం, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీని పరిశీలించిన అదనపు కలెక్టర్

బచ్చన్నపేట: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణను అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఎన్ని కంప్యూటరీకరణ జరిగాయని టీంలీడర్లు తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ ఉన్నారు.

బాలికల పట్ల వివక్ష వద్దు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

వీధి కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి



పాలకుర్తిలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

పాలకుర్తి, జనవరి 10 : మండల కేంద్రంలో బుధవారం తెల్లవారు జామున అంగోతు రవికి చెందిన ముప్పై గొర్రెలను వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. రెండు రోజుల క్రితమే సూర్యాపేట జిల్లా తిర్మలగిరి నుంచి రూ. 3.80 లక్షలు వెచ్చించి 30 గొర్రెలు కొనుగోలు చేసి తీసుకొచ్చానని, చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి అందులో ఉంచగా వీధి కుక్కలు కంచెపై నుంచి దూకి గొర్రెలను కరిచి చంపేశాయని బాధిత రైతు రవి తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర వచ్చి జరిగిన నష్టాన్ని అంచనా వేశారని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు

హామీల అమలుకు సమయమిద్దాం

కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 10: అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కొంత సమయం ఇచ్చి హామీల అమలు కోసం ప్రశ్నిద్దామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని శ్రీనిధి ఫంక్షన్ హాల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించగా, వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను బెదిరించేందుకు కేసులు పెడుతున్నారని, ఎవరూ అధైర్యపడవద్దని, తనను ఎన్నుకున్న వారి కోసం ఎక్కడికైనా రావటానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. గొర్లకాపరులు డీడీలు కట్టి ఎదురు చూస్తున్నారని, వారికి జీవాలను అందించాలని, లేదంటే సంక్రాంతి పండుగ తరువాత పోరాడుదామన్నారు. అక్రమ కేసులకు తెరలేపంతో పాటు, ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చేయాల్సిన పనులు పక్కనబెట్టి విచారణలు, విజిలెన్స్ కమిటీలు అంటూ కాలయాపన చేయడం తగదన్నారు. ప్రతీది ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినపుడు తగు రీతిలో స్పందిస్తారని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పని చేసి పనిచేసి గెలిపించాలని కోరారు. తాను ఎన్నికల సమయంలో చెప్పినట్టుగా కొద్ది రోజుల్లోనే బచ్చన్నపేట మండలానికి చెందిన పలువురికి తమ నీలిమ ఆస్పత్రిలో రూ. 22 లక్షల విలువైన ఉచిత వైద్యం, 130 మందికి సర్జరీలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి రమణారెడ్డి, బావండ్ల కృష్ణంరాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, మద్దికుంట రాధ, ఆజీం, వడ్డేపల్లి మల్లారెడ్డి, ఎండీ షబ్బీర్, కొండి వెంకట్‌రెడ్డి, పీరోజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



అవిశ్వాస సమావేశంలో సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఒక్కరు కూడా రాలేదు

అవిశ్వాస సమావేశానికి సభ్యుల గైర్హాజరు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 10: స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీపీ కందుల రేఖపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఈ విషయమై గత నెల 16వ తేదీన ఎంపీటీసీలు ఆర్డీవోకు నోటీసు ఇవ్వగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో అవిశ్వాసం నోటీసును రద్దు చేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటించారు. గత నెల 16న 9 మంది ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, గుర్రం రాజు, చల్లా సుధీర్ రెడ్డి, మునిగెల రాజు, కనకం స్వరూప, ఇనుగాల రజిత, మాలోతు లలిత, పడిశాల సుగుణ, సింగపురం దయాకర్ ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ ఆర్డీవోకు నోటీసు అందించిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన ఎంపీపీ భర్త తనతో పాటు 8మంది ఎంపీటీసీలను గోవాకు తీసుకెళ్లారు. మిగితా ఏడుగురు సభ్యుల్లో ఎవరు కూడా బుధవారం నాటి సమావేశానికి రాలేదు. అవిశ్వాస తీర్మానం నిర్వహించాలంటే మొత్తం సభ్యుల్లో 2/3 వంతు అంటే 15 మందిలో 10మంది సభ్యులు ఉండాలి. కాని ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు సమావేశం హాల్‌లో వీడియో కెమెరాలను ఏర్పాటు చేసి సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయగా ఒక్కరు కూడా రాకపోవడంతో సభను రద్దు చేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధరస్వామి, క్రాంతి, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పట్టాలు తప్పిన 'చార్మినార్'

మానుకోట జిల్లాకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు

స్వల్పంగా గాయపడిన రఘునాథపల్లి మహిళ

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రైలు పట్టాలు తప్పిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో మహిళ స్వల్పంగా గాయపడింది. బాధితులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాకూబ్‌పాషా, బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ ఇబ్రహీం ఆలీ సంక్రాంతి పండుగకు తమ పిల్లలను తీసుకువచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా, కొంతకాలంగా మానుకోటలో పెయింటింగ్ పని చేస్తున్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన టి.శ్రీనివాస్ భార్య లక్ష్మి సైతం తమ పిల్లలను తీసుకొచ్చేందుకు అదే రైలులో వెళ్లారు. నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆ రైలు పట్టాలు తప్పడంతో సైడ్‌వాల్స్ ఢీకొట్టింది. ఈ ఘటనలో యాకూబ్‌పాష కాలు విరగగా ఇబ్రహీం ఆలీకి చేయి విరిగింది. లక్ష్మి చేయికి స్వల్పగాయాలయ్యాయి. ఆ ముగ్గురిని దక్షిణమధ్య రైల్వే అధికారులు లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తక్షణ సాయంగా ఇబ్రహీంఆలీ, యాకూబ్‌పాషాకు ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు అందించారు. కాగా, ఈ రైలు ప్రమాదఘటనలో బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గ్యాస్ సరఫరాలో జాప్యం జరగొద్దు

డీలర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఎస్‌వో

లింగాలఘణపురం, జనవరి10: రఘునాథపల్లి మండల కేంద్రంలోని భారత్‌గ్యాస్ కార్యాలయాన్ని డీఎస్‌వో రోజరాణి బుధవారం తనిఖీ చేశారు. గత పదిరోజులుగా రఘునాథపల్లి శ్రీసాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన గ్యాస్ సిలిండర్ల పంపిణీ వ్యవహారంపై ఈనెల 10న 'వంటకు తంటాలు..' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌తో పాటుగా కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించారు. పదిరోజులుగా సిలిండర్‌లను పంపిణీ చేయకపోవడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో వెంట సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రఘునాథపల్లి గ్యాస్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్‌వో రోజారాణి

కేయూ పరీక్ష కేంద్రాలను సందర్శించిన వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కేయూ క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో నిర్వహిస్తున్న పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుబే దారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నగరంలోని గీతాం జలి, మాస్టర్‌జీ, సిటీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణా ధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యూలర్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ పరిధిలో బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు బుధవారం తెలిపారు. రెగ్యూలర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ హాజరుకావాలన్నారు.

కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హోల్టింగ్‌ను పరిశీలిస్తాం

▸▸ రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్ రెడ్డి


కేసముద్రం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మణుగూర్, ఇంటర్‌సిటీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌ల హోల్టింగ్‌ను పరిశీలించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణీకులు ఆయనకు రైళ్ల హోల్టింగ్‌పై విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని, త్వరలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హోల్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటే మూడో లైను నిర్మాణంతోపాటే ప్లాట్‌ఫాలపై ఫుల్‌కవర్‌షెడ్లు, డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌పై ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వరంగల్‌కు అప్‌అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, స్థానికులు వోలం శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తొనుపునూరి భాస్కర్, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపెందర్ ఉన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 10 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో సందడి నెలకొంది. మహాజాతరకు ముందుగానే భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం సుమారు 30 వేల మంది తల్లుల దర్శనాలు చేసుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. చల్లగా చూడాలని వేడుకున్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఐనవోలు జాతరలో వాకిటాకీ సేవలు

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో దేవస్థానం అధికారులు వాకిటాకీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రమే వాకిటాకీల ద్వారా బందోబస్తు విధులు నిర్వర్తించేవారు. గత జాతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం పరిశీలన, బోనం, పట్నాల టిక్కెట్ల విక్రయాలు, లడ్డుప్రసాదం అమ్మకాల వద్ద భక్తుల రద్దీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవిధంగా ఆయా విభాగాలు చూసే

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్

వడ్డెపల్లి, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టానికి నిరసనగా గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 చట్టంలో భాగంగా డ్రైవర్లపై మోపిన చట్టం వలన డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్షా, రూ. 7 లక్షల జరిమానాను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్, జనవరి 10: ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ జాతీయ సేవ పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన వారిలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సీహెచ్. అక్షయశ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎ.ఇప్రితా, కోఎడ్యుకేషన్ మహిళ ఇంజరింగ్ కళాశాల నుంచి ఎల్.అనిల్ కుమార్, వర్సిటీ ఫార్మసీ కళాశాల నుంచి పి.సందీప్‌లు ఉన్నారని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు.

నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీ భూములు ఇవ్వొద్దు

కేయూ క్యాంపస్, జనవరి 10: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని కేయూ ఏబీవీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ మాట్లాడారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

- రూ. 5 లక్షల 50 వేల జరిమానా

వరంగల్ లీగల్, జనవరి 10 : మూగ, మానసిక వికలాంగురాలైన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 లక్షల 50వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వై.సత్యేంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. అదే విధంగా బాధితురాలికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి రూ. 5 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మంగమ్మతోట మార్కండేయ నగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక పుట్టుకతోనే మూగ, మానసిక వికలాంగురాలు. ఎప్పటిలాగే బాధితురాలిని ఇంటి వద్ద ఉంచి 2019 నవంబరు 7న పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న కూతురుని అడుగగా తనకు కడుపునొప్పిగా ఉందని వారికి సైగలతో చెప్పడంతో ఏమి జరిగిందని అడుగగా 6వ తేదీన మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన తేజావత్ హచ్చు అలియాస్ రమేశ్ ఇంటిలోకి వచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. గతంలో కూడా రెండు సార్లు అత్యాచారానికి పాల్పడినట్లు సైగల ద్వారా తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడి తేజావత్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5 లక్షల 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

మంత్రాలు చేస్తున్నావంటూ నింద..

మనస్తాపంతో బాధితుడి ఆత్మహత్య


నర్సయ్య (ఫైల్)

తరిగొప్పుల, జనవరి 10: మంత్రాలు చేస్తున్నామని గ్రామస్థులు నిందించడంతో మనస్తాపం చెందిన కలకుంట్ల నర్సయ్య (52) అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్య మంత్రాలు చేయడం వల్లే తమ తండ్రి ఆరోగ్యం క్షీణించిందని మండల కేంద్రం శివారు కనీలకుంట్లకు చెందిన తుపాకుల సాంబరాజు, ఆయన తమ్ముడు శ్రీకాంత్ ఆరోపించారు. ఇదే విషయమై గ్రామస్థులు, బంధువుల ఎదుట అవమానపరిచారు. దీంతో మనస్తాపం చెందిన నర్సయ్య మంగళవారం తన భార్యను గొర్లను మేపేందుకు పంపించి సాయంత్రం సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్సై నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాదు


డ్రెస్సులు పంపిణీ చేస్తున్న దాత గజ్జి మధు

జనగామ టౌన్, జనవరి 10: చదువుకు పేదరికం అడ్డు కాదని, ప్రభుత్వం కల్పించే వనరులను వినియోగించుకుని అమ్మాయిలు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ వస్త్ర వ్యాపారి గజ్జి మధు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం ఆయన జనగామలోని బాలికల జూనియర్ కళాశాలలో 350 మంది విద్యార్థినులకు సుమారు రూ.4 లక్షల విలువైన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థినులకు ప్రోత్సాహం ఇవ్వడంలో భాగంగా తాను ఏటా పలు ప్రభుత్వ కళాశాలల్లో దుస్తుల పంపిణీ చేపడుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, బెలిదె శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫొటో ముద్రించాలంటూ వినతి

జనగామ టౌన్, జనవరి 10: కరెన్సీపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఫొటో ముద్రించేలా చొరవ చూపాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షికి హైదరాబాద్‌లో బుధవారం అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీలో ఫొటో ముద్రణపై తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాయాలని కోరారు.


కాంగ్రెస్ ఇన్‌చార్జి మున్షికి వినతి పత్రం ఇస్తున్న పరశురాం

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మనోహర్

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 10: కథారచన విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గొడుగు మనోహర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మనోహర్ ఈ నెల 12న మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మనోహర్‌ను అభినందించారు.


ఎమ్మెల్యే పల్లా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మనోహర్

క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

జనగామ టౌన్, జనవరి 10: పలు సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం జనగామలోని తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సమితి, ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్, ఇటిమాద్ ఉర్దూ డైలీ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు.



చిన్నపెండ్యాలలో కూలిపోయిన తరగతి గదులు, పాఠశాల ఆవరణలో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

అరకొర వసతులు

- సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు
- పెచ్చులూడుతున్న స్లాబ్‌లు, కూలుతున్న భవనాలు
- లోపించిన పారిశుధ్యం, తాగునీటికి ఇబ్బందులు
- ప్రహరీలు లేక పందుల స్వైర విహారం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, పట్టించుకోని అధికారులు

చిలుపూర్, జనవరి 10: విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా అందుకనుగుణంగా పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జిల్లాల్లో మొత్తం 103 జడ్పీ, 340 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండగా వీటిలో సుమారు 70 పాఠశాలల్లో తాగునీరు, సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రహరీలు లేక రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. మరి కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

చిలుపూర్ మండలంలోని చిన్నపెండ్యాల, నష్కల్, కొండాపూర్ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను పట్టించుకునే నాధుడే కనిపించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని ప్రగల్భాలు పలికిన నాటి ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఊరికి ఆమడ దూరంలో ఉన్న నష్కల్ ఉన్నత పాఠశాలకు నేటికీ ప్రహరీ నిర్మించకపోవడమే ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

అదేవిధంగా చిన్నపెండ్యాల, కొండాపూర్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా తరగతి గదులు అందుబాటులో లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. భవనాలు శిథిలావస్థకు చేరి స్లాబ్‌లు పెచ్చులూడుతున్నా, తరగతి గదులు కూలుతున్నా పాలకులు పట్టించుకోకపోవడంలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడం, తాగునీటికి సంబంధించి ఏర్పాట్లు సైతం పూర్తి చేసినప్పటికీ వాటిని వినియోగంలోకి తేకపోవడంతో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కడియం దృష్టి సారించాలి..

కర్ణకంటి స్వప్న వెంకటేశ్, సర్పంచ్, నష్కల్



ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రహరీ, మూత్రశాలల నిర్మాణంపై తగు చర్యలు తీసుకోవాలి. తరగతి గదులు, కార్యాలయాల స్లాబ్‌లు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుండడంతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. రెండో విడత మన ఊరు - మన బడి కార్యక్రమంలో చేర్చాలి.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

గుడిమళ్ళ సంపత్, నోడల్ అధికారి, చిలుపూర్



పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. చిన్నపెండ్యాల, నష్కల్, కొండాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మూత్రశాలలు సరిగా లేవు. ప్రహరీ నిర్మించాల్సి ఉంది. తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిపై నివేదికను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు, ఉన్నతాధికారులకు నివేదిస్తా.


పెచ్చులూడుతున్న కొండాపూర్ ఉన్నత పాఠశాల కార్యాలయ గది


ప్రహరీ లేని నష్కల్ ఉన్నత పాఠశాల


చిన్నపెండ్యాల హైస్కూల్‌లో పనిచేయని నల్లాలు

బాలికల పట్ల వివక్ష వద్దు

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు

చిలుపూర్, జనవరి 10 : ప్రస్తుత సమాజంలో బాలికల పట్ల వివక్షను విడనాడాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం ఆయన పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలిక సాధికారత సదస్సుకు రోటరీ క్లబ్ ఆఫ్ హన్మకొండ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ దారం శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న వివక్ష, వుమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాల సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహారెడ్డి, ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ మర్రి శ్రీధర్, ఉపాధ్యాయులు కోమలి, నరసింహారావు, లక్ష్మి, పీఈటీ చంద్రశేఖర్ రెడ్డి, రామ్మూర్తి, కేకే మూర్తి, వనజారాణి, రమాదేవి, రమణకుమార్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సహకారంతో పల్లగుట్ట ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు బుధవారం రూ.50 వేల విలువ గల సైకిళ్ళతో పాటు, 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దారం శ్రీనివాస్, హెచ్ఎం కేతిరి నరసింహారెడ్డి, పీఈటీ చంద్రశేఖర్ రెడ్డి, ఆనందం పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ వారు సమకూర్చిన సైకిళ్ళను అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

గంజాయి విక్రయిస్తే పీడీయాక్టు

స్టేషన్‌ఘన్‌పూర్: గంజాయి గాని, డ్రగ్స్ గాని విక్రయిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని ఏసీపీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన ఘన్‌పూర్ బస్టాండ్, రైల్వేస్టేషన్, శివునిపల్లి గ్రామాల్లోని కిరాణ దుకాణాలు, పాన్‌షాపులలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయించిన, వినియోగిస్తూ పట్టుబడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొందరు యువకులు ఆన్‌లైన్‌లో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారనే సమాచారం ఉందని, త్వరలోనే వారిని పట్టుకుంటామని అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు సట్ల రాజుగౌడ్, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు నాగరాజు, రఘుపతి, ప్రవీణ్, వినయ్‌కుమార్, ఏఎస్సైలు రాజమౌళి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏడునూతులలో అయోధ్య అక్షింతల పంపిణీ

కొడకండ్ల, జనవరి 10: అయోధ్య రామయ్య అక్షింతలను ఏడునూతులలో బుధవారం పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలకు వేణుగోపాల స్వామి దేవాలయంలో పూజారి శ్రీనివాస్ పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో భజనలతో, కోలాటాలతో, రామనామ సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రతీ హిందూ ఇంటికి వెళ్ళి అందించారు. హిందువులంతా జనవరి 22న బాలరాముని ప్రతిష్ఠా సమయంలో టీవీలో వీక్షించి మొదటి హారతిని తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాము లక్ష్మీనారాయణ, కె.యాదయ్య, కన్నయ్య, మురళి, ఎలికట్టె వెంకన్న పాల్గొన్నారు.

చిలుపూర్: అయోధ్య శ్రీరాముని అక్షింతలను చిలుపూర్‌తో పాటు, శివారులోని కొత్తపల్లి, వడ్డెరగూడెం తదితర కాలనీల్లో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో, బుగులు వెంకన్న ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ నేతృత్వంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ శోభాయాత్ర చేపట్టి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో ప్రారంభం కానున్న శ్రీరాముని ఆలయ ప్రతిష్ఠిత సందర్భంగా ప్రతీ ఒక్కరూ తమ ఇంట్లో ప్రత్యేక పూజలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, పిట్టల రమేష్, ఎలిశాల శ్రీనివాస్, తోట రంజిత్‌కుమార్, మాచెర్ల స్వామి, కలకోల రజనీకుమార్, పిట్టల జంపయ్య, సంపత్, దోకి శ్రీనివాస్, మాచెర్ల ప్రవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులు నిర్మించకపోతే కందకం తవ్వుతాం


కృష్ణాజీగూడెంలో రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

చిలుపూర్, జనవరి 10 : మండలంలోని కృష్ణాజీగూడెం - చక్రితండాకు వెళ్ళే మార్గంలో నూతనంగా చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా అవసరమైన చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టకపోతే కందకాలు తవ్వడానికైనా వెనుకాడబోమని రైతులు సాదం భీమయ్య, చేరాలు, ఊరడి యాదగిరి తదితరులు అధికారులను హెచ్చరించారు. ఈ మేరకు వారు చక్రితండాలో సమీపంలో జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి రోడ్డు సౌకర్యం లేని చక్రితండాకు ప్రభుత్వం బీటీ రోడ్డును మంజూరు చేయడం హర్షనీయమే అయినపప్పటికీ, అవసరమైన ప్రదేశాల్లో కల్వర్టుల నిర్మాణం చేపట్టని కారణంగా, ఎగువన ఉన్న గుట్టలతో పాటు, బొంత గట్టు కాల్వ నుంచి వచ్చే వరదనీరు కారణంగా తమ పంట పొలాలు పూర్తిగా మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సాదం నాగరాజు, మల్లేష్, రామచంద్రం, సాంబరాజు, అయిలయ్య, లింగయ్య, గట్టయ్య, పోశయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్‌యుపీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్

జఫర్‌గఢ్, జనవరి 10 : భాషా పండితుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యుపీపీటీఎస్) జిల్లా అధ్యక్షుడు ములుకనూరి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కూనూరు జడ్పీ హైస్కూల్‌లో ఆర్‌యుపీపీటీఎస్ సంఘం క్యాలెండర్లను నోడల్ అధికారి ఎండి.పర్వేజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా భాషా పండితులు ఉన్నత పాఠశాలల్లో వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. సర్వీస్ మొత్తం పూర్తయ్యేసరికి ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోకుండానే విరమణ పొందుతున్నారన్నారు. గత ప్రభుత్వం పలు జీవోలు తీసుకువచ్చినా పండితులకు న్యాయం జరగలేదన్నారు. భాషా పండిత వ్యవస్థను రద్దు చేసి.. పండిత ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. నోడల్ అధికారి పర్వేజ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా భాషా పండితులకు పదోన్నతులు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, చంద్రమోహన్, రాజేందర్, అనిల్‌కుమార్, వేణుగోపాల్, విజయ, ఎండి.సిరాజ్, కరుణశ్రీ, ఉమామహేశ్వరి, శ్రీనివాస్, శ్రీనాథ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీలు అందజేత

నర్మెట, జనవరి 10: మండల కేంద్రంతోపాటు మండలంలోని హన్మతాపూర్, ఇసుకబాయితండ గ్రామాలకు చెందిన ప్రజ్ఞాపురం యాదగిరి, మూల బిందుశ్రీ, బానోతు భగవాన్‌లకు బీఆర్ఎస్ మండల నాయకులు బుధవారం ఎల్‌వోసీలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుల చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఆశ్రయించగా ఆయన ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఎల్‌వోసీలు మంజూరీ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బానోతు లలిత, సర్పంచ్‌లు పగడాల విజయ, బానోతు అనిత, ముప్పిడి విజయ, బీఆర్ఎస్ నాయకులు నక్కల రవి, ధరావత్ లాలు, నరేష్ పాల్గొన్నారు.

కడియం ఫౌండేషన్ ఆర్థిక సాయం

రఘునాథపల్లి, జనవరి 10: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పాత్రికేయుడు రాసమల్ల యాకస్వామి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బుధవారం కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కడియం కావ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వామికి ఇద్దరు కుమారులు, 14 నెలల కూతురును ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కొంరయ్య, మల్లేష్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఔదార్యం చాటిన స్నేహితులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 10: మండలంలోని ఛాగల్ గ్రామానికి చెందిన మారేడుపాక చక్రపాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి చక్రపాణి కుమారుడు రమేష్‌తో ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న మిత్రులు ముందుకువచ్చారు. అంతా కలిసి రూ.34వేలు జమచేసి బుధవారం రమేష్‌కు అందించి ఔదార్యాన్ని చాటారు. కార్యక్రమంలో సొదరపల్లి సంపత్‌రాజ్, సతీష్, రమేష్, ప్రదీప్, అశోక్, సమ్మయ్య, రామ్మూర్తి, నరేష్‌కుమార్, రమేష్, వెంకటేష్, రాజు, అశోక్, రమేష్, కనకసేనారాజు తదితరులు పాల్గొన్నారు.


చక్రపాణి కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న స్నేహితులు

'నేడు ఛలో రైల్ నిలయం'

రఘునాథపల్లి, జనవరి 10: ఈ నెల 11న జరిగే ఛలో రైల్ నిలయం కార్యక్రమానికి రైల్వే కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ ఆలేరు బ్రాంచి వైస్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. రఘునాథపల్లి యూనిట్ నెంబర్ ఏడులో రైల్వే కార్మికులు బుధవారం నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, బత్తుల కిరణ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

కొడకండ్ల, జనవరి 10: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉన్నతి కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి రాము, జిల్లా ఉన్నతి ప్యానెల్ సభ్యుడు రఘుజీతో కలిసి బుధవారం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో క్రేజియారాణి, ప్రిన్సిపాల్ సునీత, సీఆర్‌పీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

58 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనం


1965-66 బ్యాచ్ ఏబీవీ హైస్కూల్ విద్యార్థులు

జనగామ టౌన్, జనవరి 10: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు సుదీర్ఘ కాలం తరువాత కలిశారు. జనగామలోని ప్రభుత్వ ఎయిడెడ్ ఏబీవీ హైస్కూల్‌కు చెందిన 1965-66 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 58 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఒకరినొకరు చూసుకుని ఆశ్చర్యపోయారు. బాలబాలురుగా ఉన్నప్పుడు కలిసిన మిత్రులు.. వృద్ధులయ్యాక కలవడంతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. బాగోగులు తెలుసుకుంటూ.. ఆనాటి పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.గోపయ్య, మురళి, మహేందర్‌రాజు, వెంకట్‌రెడ్డి, రఘురామ్, సుకుమారి, లాలన, రేణుక, కమల తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ ట్రస్టు సహకారం అభినందనీయం


చెక్కులతో మెరిట్ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 10: గ్రామీణ మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉల్లాస్ ట్రస్టు సహకారం అభినందనీయమని ఇప్పగూడెం ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.రఘుజీ అన్నారు. బుధవారం 10వ, 9వ తరగతులలో టాప్ 5లో ఉన్న 10మంది విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పీఎల్ నరేందర్ ఆధ్వర్యంలో ఉల్లాస్ ట్రస్టు ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1000 విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బహుమతి అనేది విద్యార్థుల్లో పట్టుదలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రాజమౌళి, నాగరాజునరావు, పీఈటీ ప్రమోద్ రెడ్డి, ఉల్లాస్ ట్రస్టు కోఆర్డినేటర్ మేడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 10: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలోని పీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా విస్తరించే పనులకు అనుమతి ఇవ్వాలని, అనేక ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థుల కోరిక మేరకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, పలు పెండింగ్ పనులు పూర్తి చేయించాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం అందించానన్నారు.


హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఇందిర